క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఝాన్సీరాణి



కమలాపూర్ : మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తవుటం ఝాన్సీరాణి శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ఆమె మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మంత్రి ఆమెను శాలువాతో సన్మానించి అభినందించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ రాక

ఎల్కతుర్తి : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శనివారం మండల కేంద్రానికి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాల ఆవరణలో నూతన కళాశాల భవన నిర్మాణం కోసం భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా 'గండ్ర' జన్మదిన వేడుకలు

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు శాంతరవి, రవి, ప్రతాప్‌సేనారెడ్డి, రఘుపతిరెడ్డి, రవిపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, జంగారెడ్డి, వలిహైదర్, ఐలయ్య, వీరన్న, రాజేందర్, కృష్ణమూర్తి, భిక్షపతి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం రద్దు

శాయంపేట : ప్రెస్‌క్లబ్ కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రంగు శ్రీధర్ తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వలన సభ్యుల అభిప్రాయాల మేరకు కమిటీని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఐనవోలు : ఆటో, కారు ఢీ కొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పంథిని గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వరంగల్‌కు చెందిన గుండె యాదగిరి ఆటోలో వర్ధన్నపేటకు వెళ్తున్నాడు. నర్సంపేటకు చెందిన ఆరుట్ల నర్సయ్య కారులో వర్ధన్నపేట నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. పంథినికి చేరుతున్న క్రమంలో మద్యం మత్తులో ఆటో నడుపుతున్న యాదగిరి పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లపై దూసుకెళ్లాడు. ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టి ఆటో నుంచి కిందపడిపోయాడు. యాదగిరికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీ

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అక్కంపేట సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేటకు చెందిన వేల్పుల లావణ్య, కొమ్ముల లక్ష్మి బైక్‌పై మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వస్తున్నారు. ఈ క్రమంలో అక్కంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో లావణ్య, లక్ష్మికి గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

కాజీపేటలో ఆటో చోరీ

కాజీపేట: కాజీపేట పట్టణ ప్రధాన రహదారి పక్కన పార్కింగ్ చేసిన ఓ ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం సాయంత్రం చోరీ చేశారు. స్థానిక ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన భూక్య రాజ్‌కుమార్.. ఓ బార్ సమీపంలో ఆటోను పార్క్ చేశారు. కిరాణంలో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి వచ్చేలోపు ఆటో కనిపించలేదు. దాంతో ఆటో డ్రైవర్ రాజ్‌కుమార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మడికొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మడికొండలో జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ వినాయక నగర్‌లోని నార్లగిరి వనమాల ఇంట్లో ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి పొగలు బయటకు రావడంతో చుట్టుపక్క వాళ్లు స్పందించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి, బియ్యం, దుస్తులు కాలిబూడిదయ్యాయి. రూ.సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, బాధితులను స్థానిక నాయకులు దువ్వ శ్రీకాంత్, నవీన్, తదితరులు పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.


పరకాల : దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే దంపతులు


కమలాపూర్‌లో..


పరకాల : జ్వాలా తోరణం నుంచి దాటుతూ..


పరకాల : దీపాలు వెలుగిస్తున్న భక్తులు


పరకాల : బారులుదీరిన భక్తులు

ఆలయాల్లో 'కార్తీక' శోభ

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు
- జ్వాలాతోరణం, దీపాలంకరణతో భక్తుల కోలాహలం
- అంబరాన్నంటిన సంబురాలు

పరకాల : పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి(కుంకుమయ్య) ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. తెల్లవారుజామున 3గంటల నుంచి అర్చకుడు సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు ప్రారంభం కాగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు దంపతులు భక్తులకు మహా అన్నదానం చేపట్టగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాల తోరణం వెలిగించగా అందులో నుంచి దాటేందుకు భక్తులు పోటీ పడ్డారు. పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్‌లు రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకుడు నాగభూషణం శర్మ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం కార్తీకపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. రుక్మిణీ సత్యభామసమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేపట్టారు. అలాగే శ్రీపార్వతీదేవి సమేత పంచకూట శివాలయంలో భక్తులు దీపాలు వెలిగించి మహాదేవస్వామిని దర్శించుకున్నారు. ఆకాశదీపం, జ్వాలాతోరణం కార్యక్రమాలను నిర్వహించారు.

కమలాపూర్ : మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భక్తులు ఉదయాన్నే ఉసిరి స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాలు కార్తీక శోభ సంతరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని విశ్వపతి ఆలయంలో, కన్నూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించగా పలు శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కాంగ్రెస్ నాయకుడు పుల్లూరి శ్రీనివాస్‌రావు, సంపత్‌రావు, కిరణ్‌రావు, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : కార్తీక మాసంలో దీపారాధన చేయడం వలన సర్వపాపాలు తొలిగిపోతాయనే నమ్మకంతో మహిళలు శుక్రవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని శివాలయాల్లో కార్తీకమాస పూజలు నిర్వహించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో నూతన దంపతులు పాల్గొని పూజలు చేశారు. అలాగే భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక ఇత్తడి పాత్రలో జ్యోతిని వెలిగించి ధ్వజస్తంభం చివరిన ఆకాశ దీపాన్ని వేలాడదీశారు.

దామెర : మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ మంత్రోచ్ఛరణ నడుమ వేడుకలు వైభవంగా జరిగాయి. ఊరుగొండలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆలయ అర్చకులు శరత్‌శర్మ, శ్రావణ్ శర్మ పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. మహిళలు దీపాలు వెలిగించారు.

శాయంపేట : మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని శివమార్కండేయ, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకుడు రాజ్‌కుమార్ సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతాన్ని వేదమంత్రోచ్ఛరణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు. అలాగే పెద్దకోడెపాకలో అతిపురాతనమైన రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు అనుదీప్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మహిళలు తులసి చెట్టు వద్ద దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పీచర గ్రామంలో అర్చకులు రామలింగం, స్వార్తీక్, విద్యాసాగర్, సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణం, రుద్రహోమం, చేశారు.


ఎల్కతుర్తి : శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


కమలాపూర్‌లో..


దామెర : దామేశ్వరాలయంలో..


శాయంపేటలో..


ఆత్మకూరు : శివాలయంలో..


వేలేరు : పీచరలో..

ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలి

ఐనవోలు : క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్నికల డివిజన్ ఇన్‌చార్జ్ బన్న ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అడ్డగట్ల రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 33 బూత్‌లల్లో ఇప్పటి వరకు 3200 మంది సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. దేశంలో సభ్యత్వ నమోదులో బీజేపీ మొదటి స్థానంలో ఉందని, మండలంలో కూడా మొదటి స్థానంలో నిలిపేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్, కోశాధికారి బొల్లెపల్లి మహేష్, ప్రణయ్, పొన్నాల రాజు, దండు కిషన్, పులి సాగర్, వెంకటనారాయణ, మధు, రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బన్న ప్రభాకర్

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం డాక్టర్ రమేశ్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన భానుప్రసాద్, వైష్ణవి, బ్లెస్సీ 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్ 17 బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 18వ తేది వరకు నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీసీ అధ్యక్షురాలు పద్మావతి, తల్లిదండ్రులు అభినందించారు.


వైష్ణవి


బ్లెస్సీ


భాను ప్రసాద్

స.హ చట్టంపై అధికారుల నిర్లక్ష్యం

శాయంపేట : ప్రభుత్వ పాలన, ఉద్యోగుల విధులు, నిధుల వివరాలను తెలుసుకునేందుకు తీసుకొచ్చిన సమాచారహక్కు చట్టంపై కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగరి సాంబయ్య మండిపడ్డారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శాయంపేట ఎంఈఓ కార్యాలయంలో జులై 27న సమాచారహక్కుచట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 60 రోజులు గడిచినా సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడం లేదని, దీంతో హనుమకొండ డీఈఓ కార్యాలయంలో అప్పీల్ చేసినట్లు పేర్కొన్నారు. 30 రోజుల తర్వాత అప్పిలేట్ అధికారి తిరిగి అదే దరఖాస్తు ఎంఈఓ కార్యాలయానికి బదిలీ చేస్తూ లేఖ పంపించారని, నెలలు గడిచినా సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

కులగణనను వినియోగించుకోవాలి

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనను ప్రజలు వినియోగించుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సురేష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కులగణన సర్వేలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, భూమి, ఉపాధి, విద్య తదితర వివరాలను ఎన్యుమరేటర్లకు తెలుపాలని సూచించారు. సర్వే విషయంలో ఎలాంటి అపోహాలు అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, శ్రీకాంత్, కిరణ్, సుధాకర్, మాజీ సర్పంచ్ సాంబయ్య, అర్జున్, మోహన్, మోహన్‌రెడ్డి, కరుణాకర్, జనార్దన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేందర్, సురేష్

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఎస్సై


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్సై అజ్మీరా సురేష్ శుక్రవారం సందర్శించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దళారులు చెప్పే మాయమాటాలు నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోననే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికుడిపై దాడి

హసన్‌పర్తి: నగరంలోని 1వ, 55వ డివిజన్లలో స్వచ్ఛ ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వీర మొగిలిపై దాడి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం భీమారానికి చెందిన వీర మొగిలి.. జీడబ్ల్యూఎంసీలో ఆటో డ్రైవర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం చెత్త సేకరించడానికి వెళ్లగా భీమారం బస్టాండ్ వద్ద మొగిలికి బాబోయి హోటల్ యజమాని బావమరిది శివకృష్ణ మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో ఆగ్రహానికి గురైన శివకృష్ణ.. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇనుప రాడుతో మొగిలిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

నలుగురు బీటెక్ విద్యార్థులపై కేసు

హసన్‌పర్తి: నగర శివారులో ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులపై కేసు నమోదైనట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. హసన్‌పర్తి మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు గంజాయి తాగుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై రవి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు శివసాయి, సాత్విక్‌రెడ్డి, దినేష్, దక్షిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

8మందికి గ్రూప్ -4 ఉద్యోగాలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రంలో (ఎస్సీ స్టడీ సర్కిల్) గ్రూప్ -4 ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకున్న అభ్యర్థుల్లో 8మంది ఉద్యోగాలు సాధించారని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్ శుక్రవారం తెలిపారు. ఈమేరకు ఈ.రాధిక, ఎం.స్వప్న, మౌనిక, ఎన్.నిశాంత్, టి.నేతాజీ, సునీల్‌కుమార్, చక్రబాబు, నవీన్‌ను అభినందించారు.


బంగారు గొలుసు అపహరణ

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట రుద్రమనగర్ కాలనీలో బంగారు చైన్ చోరీకి గురైందని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. రంగశాయిపేట రుద్రమనగర్‌కు చెందిన అబ్బరబోయిన వరలక్ష్మి గురువారం రాత్రి నిద్రించేముందు తన మెడలోని సుమారు రూ.1.60 లక్షల విలువైన మూడు తులాల బంగారు గొలుగును బ్యాగులో భద్రపరిచింది. శుక్రవారం ఉదయం లేచి చూసేసరిగా బ్యాగులో గొలుసు కనిపించకపోవడంతో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పద్మాక్షి అమ్మవారికి మహాహారతి

హన్మకొండ అర్బన్: పద్మాక్షి కాలనీలోని పద్మాక్షి దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం మహాహారతి ఇచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ శర్మ, షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు.

గదుల నిర్మాణానికి భూమిపూజ



దామెర : మండల కేంద్రంలోని దామేశ్వరాలయ ప్రాంగణంలో రెండు గదులు నిర్మించేందుకు శుక్రవారం భూమి పూజ చేసినట్లు శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన చందుపట్ల సత్యవర్దన్‌రెడ్డి అందించిన రెండు లక్షల రూపాయల విరాళంతో గదుల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించిన వస్తువులు, పూజా సామాగ్రి భద్రపరిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగా గదుల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామస్తులు, భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. భూమి పూజలో సత్యవర్దన్‌రెడ్డి దంపతులతో పాటు కమిటీ సభ్యులు పోల్సాని అనిల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, మేరుగు కుమారస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనం కోసమే ఆరోపణలు

ధర్మసాగర్ : రాజకీయ ప్రయోజనాల కోసమే మాజీ ఎమ్మెల్యే రాజయ్య ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, సీనియర్ నాయకుడు వల్లపురెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముప్పారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఇనుపరాతి గుట్టల్లోని అటవీ భూములు, పట్టా భూములపై బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్లుగా అధికారంలో ఉండి రాజయ్య ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని, కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఇనుపరాతి గుట్టల పరిధిలో ఉన్న పట్టా భూముల రైతులంతా వారి సమస్యలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన కలెక్టర్, అటవీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడారని, కానీ మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాత్రం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులే భూ కబ్జాలకు పాల్పడి కడియం శ్రీహరిపై నిందలు, విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు బెదుతున్న సర్వే నంబర్లలోని భూముల్లో అటవీశాఖకు గుంటభూమి కూడా లేదన్నారు. కొంతమంది ఫారెస్ట్ అధికారులు ఇనుపరాతి గుట్టల భూములను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. టెక్స్‌టైల్ పార్కు పరకాల నియోజకవర్గానికి తరలించడం వెనుక రాజయ్యనే ప్రధానకారణమని ఆరోపించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజయ్యను గ్రామాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైతులు మాట్లాడారు. ఇనుపరాతి గుట్టల పరిధిలో ఉన్న తమ పట్టా భూములను అటవీ శాఖ అధికారులు సాగు చేయనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వంశపారంపర్యంగా వచ్చిన భూముల్లో ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామని, పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అటవీ అధికారుల నుంచి ఇబ్బందులు రాకుండా చూడాలని రైతు కిష్టయ్య కోరారు. మాజీ సర్పంచ్‌లు రమేశ్, నర్సింహరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బాధిత రైతులు రాజయ్య, వీరయ్య, సాంబయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

12కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్లు సీఐ పులి రమేశ్ తెలిపారు. శుక్రవారం ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్న ఓ ఆటోలో గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై సాయిబాబు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఒడిశా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా బెరిఖాన్‌పల్లికి చెందిన ఫణి తనస్పార్, మరో వ్యక్తి సుభాష్ హల్దార్ అనే ఇద్దరు వ్యక్తులతో పాటు 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని అన్నారు. గంజాయి పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై సాయిబాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.


పట్టుబడిన గంజాయి, నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ రమేశ్

ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ కిశోర్, కరిష్మ 60 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్, కిడ్నీ, లివర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలీని సూచించారు.


వెద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది